
సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



తల్లి మందలించిందని..

తల్లి మందలించిందని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో శివాజీనగర్ కాలనీలో విషాదం నెలకొంది.

- 8లో



'మోడల్' స్కూళ్లు పిలుస్తున్నాయి..!

మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 1,300 సీట్లను భర్తీ చేయనున్నారు.

- 8లో

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

కాశీబుగ్గ: మందస మండలం లోహరిబంద సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ షేక్ ఖాదర్ బుఖరిని సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్వీస్ చార్జి రూ.96 వేలు సంబంధిత ఖాతాలకు జమ చేయనందున సస్పెండ్ చేశారని, ఈ మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయని ఏఓ రుషిశ్వరరావు తెలిపారు.

న్యూస్‌రీల్

శివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జలుమూరు : శ్రీముఖలింగంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే మహా శివరాత్రి ఉత్సవాలలో భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఉత్సవ ఏర్పాట్లపై శనివారం శ్రీముఖలింగంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు పకడ్బందీగా ఉండాలన్నారు. చల్లవానిపేట, కొమనాపల్లి, కరకవలస వరకు పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. చక్రతీర్థ స్నానాల సమయంలో భక్తులు ఇబ్బందిపడకుండా నదిలో తగినంత నీరు ఉంచాలని వంశధార ఎస్ఈ తిరుపతిరావును అదేశించారు. టెక్కలి డీఎస్పీ ఎ.వి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ వీఐపీల దర్శనం కోసం ఆలయం వెనుక భాగం నుంచి క్యూలైన్ ఏర్పాటు చేశామని చెప్పారు. డీఎంహెచ్ఓ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ మూడు రోజుల పాటు వైద్య శిబిరాలతో పాటు 108,104 వాహనాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. దేవదాయ శాఖ అందించే ప్రసాదాలు గంటలోనే అయిపోతుండడంతో దూరప్రాంత భక్తులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ టి.సతీష్‌కుమార్, అర్చకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రసాదాలు సిద్ధంకాని పక్షంలో కాంట్రాక్టర్‌కు అప్పగించి భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రసాదాలు పంపిణీ చేయాలని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్‌ను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ సాయి ప్రత్యూష ఎస్ఈ ఎహసాన్ బాషా, డీసీ సుజాత, తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, పంచాయతీ విస్తరణాధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మాఫియాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

ఎచ్చెర్ల క్యాంపస్: గంజాయి అక్రమ సరఫరా, అమ్మకం వంటి కేసుల్లో నేరస్తులకు కచ్చితంగా శిక్షలు పడాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాలు వేదికగా శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీస్ అధికారులకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు నియంత్రణ కేసులు, చట్టపరంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఒక్క రోజు వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గంజాయి కేసులు దర్యాప్తు పక్కాగా సాగాలన్నారు. అనంతరం కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ అధికారి ఎ.రంగనాథమ్ మాదక ద్రవ్యాలు-చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సురాన, డీఎస్పీలు అప్పారావు, శ్రీనివాసరావు, ప్రసాదరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న తలపాగా.. సిక్కోలుదేగా..

- మహాశివరాత్రి ఉత్సవాల్లో అతివిశిష్టమైనది పాగా అలంకరణ
- దాని వస్త్ర తయారీ భాగ్యం కొన్ని నేతకారుల కుటుంబాలదే
- ఏళ్ల నుంచి కొనసాగుతున్న సంప్రదాయం
- జిల్లాలోని పలు గ్రామాల నుంచి వస్త్రాల సమర్పణ
- నియమ నిష్టలతో సిద్ధం చేసిన చేనేత కార్మికులు
- నేడు శ్రీశైలానికి బయల్దేరనున్న పవిత్ర వస్త్రాలు



మహా శివరాత్రి వస్తోందంటే చాలు ఆ గ్రామాల్లో ఒకటే సందడి. దాదాపు ఒకటిన్నర నెలల ముందే అక్కడి చేనేత కార్మికులందరూ మిగతా అన్ని కార్యక్రమాలు పక్కనపెట్టేసి ఒకే ఒక్క కార్యక్రమంపై దృష్టి పెడతారు. అదే శ్రీశైల మల్లన్న స్వామికి సమర్పించేందుకు ప్రత్యేక వస్త్రం తయారీ. నేత పని పూర్తయిన తరువాత ప్రత్యేక పూజలు ఊరేగింపులు నిర్వహించి ప్రత్యేక వస్త్రాన్ని శ్రీశైలానికి తీసుకువెళతారు. ఈ పుణ్యక్రతువు పూర్తయింది. ప్రత్యేక వస్త్రం నేడు శ్రీశైలానికి బయల్దేరనుంది.

శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయ శిఖరానికి వస్త్రాలంకరణ(ఫైల్)

సండే స్పెషల్

పొందూరు:

పరమ పవిత్రమైన శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి శివరాత్రికి సిక్కోలు.. తలపాగాలు, ఇతర వస్త్రాలు పంపనుంది. ఎన్నో ఏళ్లగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా తలపాగా వస్త్రాలు పంపించేందుకు పొందూరుతో పాటు జిల్లా నుంచి పలు ఊళ్లు సిద్ధమయ్యాయి. జిల్లాలో పొందూరు, బూర్జ, ఆమదాలవలస, ఉప్పెనవలస, లావేరు గ్రామాల నుంచి వస్త్రాలను శివరాత్రికి మల్లికార్జున స్వామికి సమర్పించనున్నారు.

ఈ ఏడాది స్థానిక చేనేతవాడకు చెందిన బనిశెట్టి శ్రీనివాసరావు పొందూరు నుంచి తలపాగాను సమర్పించనున్నారు. చేనేత, జౌళి శాఖ ద్వారా బనిశెట్టి శ్రీనివాసరావు తలపాగా వస్త్రాలను శ్రీశైలం మల్లన్నకు సమర్పించడానికి దరఖాస్తులు చేసుకున్నారు. బనిశెట్టి ఆంజనేయులు మూడు తలపాగా వస్త్రాలను గుడివాడ, ఒంగోలు, వెంకటగిరి వాళ్లకు నేశారు. శివయ్యకు తలపాగా, అమ్మవారికి చీర, శనగల బసవన్న, వినాయకుడికి పంచె, నవనందులను, గాలి గోపురాన్ని అలంకరించేందుకు వస్త్రాలను నేశారు.

చరిత్ర సృష్టించిన ముఖలింగం..

- వాండ్రంగి వీధికి చెందిన ఆకాశం ముఖలింగం 33 సార్లు శ్రీశైలం వెళ్లి మల్లన్నకు వస్త్రాలను సమర్పించి చరిత్ర సృష్టించారు.
- లావేటి వీధికి చెందిన బూడిద చిన్నారావు 21 సార్లు స్వామికి వస్త్రాలను సమర్పించారు.
- వస్త్రాలను తీసుకొచ్చే పొందూరు కార్మికులకు వసతి, భోజన సదుపాయాలను, ఇతర సౌకర్యాలను కల్పిస్తారు.

నిష్టతో నేశాం..



ఎంతో నియమ, నిష్టలతో శ్రీశైలం మల్లన్నకు తలపాగా వస్త్రాలను నేశాం. ఈ వస్త్రాలను నేస్తున్నంత సేపు శివనామస్మరణలోనే ఉన్నాం. ఉపవాస దీక్షలోనే వస్త్రాలను పూర్తిచేశాం. ఏటా వస్త్రాలను నేసే మహాభాగ్యం మాకు దక్కుతుండటం ఎంతో సంతోషంగా ఉంది.

– బనిశెట్టి శ్రీనివాసరావు, చేనేత కార్మికుడు, పొందూరు

ఊరేగింపు

ఆమదాలవలస రూరల్: మందరాడ గ్రామానికి చెందిన దేవాంగులు నేసిన శ్రీశైల మల్లన్న తలపాగాను శనివారం శ్రీనివాసాచార్యులపేట గ్రామ పురవీధుల్లో ఊరేగించి శివాలయం ప్రాంగణంలో ఉంచారు. మహా శివరాత్రి నాడు శ్రీశైల శిఖరానికి ఈ పాగా చుడతామని నేత కార్మికులు తెలిపారు. ముందుగా గ్రామాల్లో తలపాగాను ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు చేస్తూ శ్రీశైలం మల్లన్న సన్నిధికి చేరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి గౌరీపతి, కె.ప్రసాద్‌రావు, కె.తవుడుబాబు, జి.పకీర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసాచార్యులపేటలో మల్లన్న తలపాగాకు పూజలు



తలపాగా వస్త్రాలతో నేతన్నలు

వస్త్రాలను సమర్పిస్తారిలా..

- మల్లికార్జున స్వామికి 366 మూరల (160 మీటర్లు) పొడవు 48 సెంటీమీటర్లు వెడల్పు ఉన్న తలపాగా.
- భ్రమరాంబ అమ్మవారికి 6 మీటర్లు పసుపు అంచు చీర.
- శనగల బసవన్న (నందీశ్వరుడు)కు 6 మీటర్ల అరుణ వర్ణ అంచు పంచె.
- వినాయకుడికి 6 మీటర్లు ఎరుపు అంచు పంచెలను నేశారు. ఈ వస్త్రాలను శివలింగాకారంలో మలిచారు.
- ప్రతి రోజూ తలపాగా, వస్త్రాల వద్ద భజనలు చేస్తున్నారు. చేనేత వాడలోని ప్రజలంతా పూజలు నిర్వహిస్తున్నారు.
- మహాశివరాత్రికి రెండు రోజుల ముందు ఈ వస్త్రాలను శ్రీశైలం తీసుకొని వెళ్తారు. దేవాంగులు సమర్పించనున్న వస్త్రాలను మహాశివరాత్రి రోజున స్వామికి అలంకరిస్తారు.
- శివరాత్రి రోజున లింగోద్భవ కాలానికి ముందు.. అంటే రాత్రి 10 నుంచి 12 గంటల మధ్య దేవాలయంలో ప్రవేశాలు నిలిపివేసి, లైట్లన్నీ ఆర్పేస్తారు.
- ఒక వస్త్రంతో తలపాగా చుట్టి మిగిలిన వస్త్రాలను నవ నందులకు, గాలి గోపురానికి అలంకరిస్తారు. పవిత్ర వస్త్రాలను తీసుకుని ఆదివారం ఆయా నేతకారులు శ్రీశైలానికి బయల్దేరనున్నారు.





శిఖరానికి తలపాగా అలంకరిస్తూ.. (ఫైల్)

గ్రూప్-2 అభ్యర్థులకు 'పరీక్ష'!



ధర్నా చేస్తున్న అభ్యర్థులు (ఫైల్)


- మెయిన్స్ పరీక్ష నిర్వహణపై రాత్రి వరకు హైడ్రామా
- ఏపీపీఎస్సీ స్పష్టత ఇవ్వడంతో గందరగోళానికి తెర
- నేడు 15 కేంద్రాల్లో హాజరుకానున్న 5535 మంది అభ్యర్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఒకప్పుడు రాష్ట్రప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ పరీక్షలు, ప్రవేశపరీక్షలు ఎంతో పకడ్బందీగా, పక్కా ప్రణాళిక ప్రకారం, ఎలాంటి డైలమా లేకుండా జరిగేవి. గత ఐదేళ్లూ సాఫీగా సాగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరీక్షలు, నోటిఫికేషన్లు ఒకింత గందరగోళాన్ని సృష్టించి అభ్యర్థుల్లో టెన్షన్, ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. తాజాగా గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహణలో అదే గందరగోళం నెలకొంది. శనివారం ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు పరీక్ష ఉంటుందో లేదో తెలియక అభ్యర్థులు అయోమయానికి గురయ్యారు. ఎట్టకేలకు రాత్రి 8.15 గంటల సమయంలో పరీక్ష యథావిధిగా జరుగుతుందని ఏపీపీఎస్సీ ప్రకటించడంతో గందరగోళానికి తెరపడింది.

సర్కారు హైడ్రామా..

ఏపీపీఎస్సీ ఇప్పటికే గ్రూప్-2 ప్రిలిమ్స్ నిర్వహించింది. మెయిన్స్ పరీక్షను జనవరిలో నిర్వహిస్తామని తొలిత ప్రకటించారు. అభ్యర్థుల ఒత్తిళ్లతో ఫిబ్రవరికి వాయిదా వేశారు. అయితే మెయిన్స్ పరీక్షల్లో రోస్టర్ విధానంతో ఫలితాలను ప్రకటించాలని అభ్యర్థులు నెలరోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రితో సహా డిప్యూటీ సీఎం, విద్యాశాఖామంత్రి, ఇతర మంత్రులు, ఎమ్మెల్సీలను అభ్యర్థులను కలిసి తమ గోడు వెల్లబుచ్చుకున్నారు. ఈ క్రమంలో పరీక్ష వాయిదా పడే అవకాశముందని ప్రచారం జరిగింది. ఇంతలో ఏం జరిగిందోగానీ చివరకు పరీక్ష యథాతథంగా ఉంటుందని ఏపీపీఎస్సీ ప్రకటించడంతో అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యారు. ఈ మేరకు జిల్లాలో ఆదివారం గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష యథావిధిగా జరుగుతుందని అధికారులు సైతం స్పష్టత ఇచ్చారు. 15 కేంద్రాల్లో 5535 మంది పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. శ్రీకాకుళం మండలం పరిధిలో 8, ఎచ్చెర్ల మండలం పరిధిలో 7 కేంద్రాలను కేటాయించామని వివరించారు.

గోపాలసాగరంలో గోపాలుడు



తెప్పోత్సవంలో విహరిస్తున్న వాసుదేవుడు

వేలాది మంది భక్తుల జయజయ ధ్వనాల నడుమ శ్రీదేవి భూదేవి సమేతుడైన వాసుదేవుడు గోపాలసాగరంలో విహరించాడు. మందసలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన తెప్పోత్సవ కార్యక్రమంలో భక్తులకు కనువిందు చేశాడు. అంతకుముందు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పొన్న చెట్టు వాహనంపైకి స్వామివారిని తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– కాశీబుగ్గ

క్లుప్తంగా

ఉపాధి పనుల్లో ప్రథమ స్థానంలో నిలవాలి



మాట్లాడుతున్న ఉపాధి పీడీ సుధాకర్‌రావు

జి.సిగడాం: ఉపాధి పనుల్లో రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలని ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర్‌రావు ఆకాంక్షించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె పండగ పనుల కోసం జిల్లాకు రూ.700 కోట్లు వరకు ప్రతిపాదనలు పంపామని తెలియజేశారు. ఇప్పటివరకు రూ.370 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పనులు కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని పేర్కొన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేస్తే రోజుకు రూ.300ల వరకు వేతనం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో చోళ్ల సత్యనారాయణ, టీఏలు ఎస్.లక్ష్మణరావు, వై.వైకుంఠరావు, జె.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు



కుళాయిలు ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని బొంతలకోడూరు గ్రామంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. కొన్ని ఇళ్లకు ఇంకా పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేయలేదు. కానీ గ్రామ పంచాయతీకి సంబంధం లేకుండా కూటమి నాయకులు పంచాయతీ వాటర్ స్కీమ్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కుళాయిలను శనివారం ప్రారంభించారు. దీంతో కోడ్ ఉల్లంఘన, పంచాయతీ అనుమతి లేకుండా కూటమి నాయకులు తీసుకున్న నిర్ణయంపై సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు 27న సెలవు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఈ నెల 27న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రయివేటు యాజమాన్యాలు, సంస్థలు తమ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

మందసలో చోరీ



దొంగతనం జరిగిన షాపు ఇదే...

కాశీబుగ్గ: మందస మేజర్ పంచాయతీ కొత్తవీధిలో ఉన్న శ్రీసత్యసాయి కమల్ బిల్డింగ్ మెటీరియల్స్ షాప్, గోడౌన్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపు ముందరి భాగంలో పక్కనున్న ఇనుప తలుపులు, తాళాలు విరగ్గొట్టి దుండగులు లోపలికి చొరబడ్డారు. అనంతరం షాప్ లోపల ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లు కట్ చేయడంతో పాటు విద్యుత్ బల్బులను తొలగించారు. చోరీలో షాపులో ఉన్న సుమారు రూ.లక్ష నగదు దోచుకెళ్లిపోయినట్లు యజమానులు ఇప్పిలి వేంకటేశ్వరరావు, మద్ది నవీన్ పోలీసులకు ఫిర్యాదు. మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవులు తరలిస్తున్న వాహనం సీజ్



గోవులతో పట్టుబడిన వాహనం

సరుబుజ్జిలి: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని శనివారం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.హైమావతి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో తనిఖీల్లో భాగంగా హిరమమండలం మండలం చిన్న కొల్లివలస గ్రామం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో మూడు గోవులు, రెండు దూడలు ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అలాగే వాటిని రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. గోవులు, దూడలను విజయనగరం జిల్లా గుర్లగింవలస గోశాలకు తరలించినట్లు వెల్లడించారు.

మోడల్ స్కూళ్లు పిలుస్తున్నాయి..!



వావిలిపల్లిపేట ఏపీ మోడల్ స్కూల్



స్కూల్‌లో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

- ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఫిబ్రవరి 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- రేపటి నుంచి ఫీజు చెల్లించేందుకు అవకాశం
- జిల్లాలోని 13 మోడల్ స్కూల్స్‌లో 1,300 సీట్ల భర్తీ

శ్రీకాకుళం న్యూకాలనీ: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే ఉద్దేశంలో నడుస్తున్న మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025–26 విద్యా సంవత్సరానికిగాను ఈనెల 24వ తేదీ నుంచి నెట్‌బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో ఎగ్జామినేషన్ ఫీజు పేమెంట్స్‌కు అవకాశం కల్పిస్తున్నారు. అలాగే దరఖాస్తులు చేసుకునే ప్రక్రియ ఈనెల 25వ తేదీ నుంచి మొదలవ్వనుంది. ఆన్‌లైన్ పేమెంట్స్‌కు మార్చి 31వ తేదీతో గడువు ముగియనుంది.

ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష

6వ తరగతిలో ప్రవేశానికి గతేడాది మాదిరిగానే పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూల్‌లోనే ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్‌లిస్టు ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లను కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్‌లిస్టు, అదేరోజు సెలక్షన్ లిస్టును సైతం వెల్లడిస్తారు. ఇకపోతే ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి తరగతులు మొదలవ్వనున్నాయి.

ఇక్కడ సీటు.. చాలా హాటు

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు కూడా ఉన్నత చదువులను అందుబాటులోకి తీసుకుని రావడమే ధ్యేయంగా ఏపీ మోడల్ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. వెనుకబడిన మండలాలను గుర్తించి ఈ పాఠశాలలను ప్రారంభించారు. ఈ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడంతోపాటు విద్యా కానుక కిట్లు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నారు. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు కార్పొరేట్ తరహా హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. పూర్తి ఇంగ్లిష్ మీడియంతో సత్ఫలితాలను సాధిస్తున్న మోడల్ స్కూల్/జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ పొందడం అంత ఈజీకాదు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంతో ఖర్చు పెట్టినా అందుబాటులో లేని నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య, ఇక్కడ అందుబాటులో ఉండడం పేద పిల్లలకు వరంగా మారింది.

జిల్లాలో 13 మోడల్ స్కూల్స్

శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం (పురుషోత్తపురం), కంచిలి (ఎంఎస్‌పల్లి), కవిటి (రాజపురం), సోంపేట (సోంపేట), పోలాకి (ఈదులవలస), పాతపట్నం (ప్రహరాజపురం), జలుమూరు (కరవంజ), బూర్జ (ఓవీపేట), జి.సిగడాం (జి.సిగడాం), లావేరు (తామాడ), రణస్థలం (కొండములగాం), పొందూరు (వావిలిపల్లిపేట), ఎచ్చెర్ల (కుప్పిలి) పాఠశాలల్లో ఒక్కోచోట 100 సీట్లు చొప్పున మొత్తం 1,300 మందిని ఎంపిక చేస్తారు.

గుర్తుంచుకోండి

- 6వ తరగతిలో ప్రవేశం పొందాలనుకునే ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. వీరికి పరీక్ష ఫీజు రూ.150లు ఉంటుంది.
- 6వ తరగతిలో ప్రవేశం పొందే ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 30 మార్కులు పొంది ఉండాలి. వీరికి పరీక్ష ఫీజు రూ.75లు ఉంటుంది.
- సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో 4, 5 తరగతుల్లో చదివి ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి.
- పరీక్షలో వచ్చే మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రతిపాదికన సీట్లు కేటాయిస్తారు.
- ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. 5వ తరగతి స్థాయిలో ఉండే ఈ పరీక్షను తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో రాయవచ్చు.
- cse.ap.gov.in లేదా apms.ap.gov.in వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

లభించే సదుపాయాలు

- నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన.
- కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఐదు ఎకరాల సువిశాల ప్రాంగణాలతో రెండంతస్తుల భవనాలను కలిగి ఉన్నాయి.
- ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలోనే విద్యా బోధన.
- విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో ఉచిత విద్య.
- బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు పూర్తిస్థాయి పరికరాలతో వేర్వేరుగా ల్యాబ్‌లు ఉన్నాయి.
- అత్యాధునిక లాంగ్వేజ్ లాబ్స్ అందుబాటులో ఉన్నాయి.
- నీట్, జేఈఈ, ఎంసెట్, ఎన్ఎంఎంఎస్, ఐఎంవో, ఐఎస్వో వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ.
- స్పోకెన్ ఇంగ్లిష్, చేతిరాతపై ప్రత్యేక శ్రద్ధ.
- అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం.
- ఎల్‌సీడీ ప్రాజెక్టర్‌తో విద్యా బోధన, డిజిటల్ విద్యా బోధనకు అవకాశం.
- 9వ తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు.
- మోడల్ స్కూళ్లకు సమీప గ్రామాల అనుసంధానంతో కూడిన ప్రత్యేక ఆర్టీసీ బస్సులు.

సద్వినియోగం చేసుకోవాలి



గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే ధ్యేయంతో ఏపీ మోడల్ స్కూళ్లను తీసుకొచ్చారు. ప్రస్తుతం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చేశాయి. ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతోంది. ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం జిల్లా

ఎన్నికల హామీలు విస్మరించి విమర్శలా..?



- అన్నదాత సుఖీభవ అమలు ఎన్నడు?
- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్

టెక్కలి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజల నుంచి తప్పించుకోవడానికి మంత్రి అచ్చెన్నాయుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. టెక్కలిలో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లోనే మంత్రి అచ్చెన్నాయుడు తన విభాగంలో అవినీతి, అక్రమాలకు గేట్లు తెరిచేశారని, అటువంటి వ్యక్తి వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయ రంగంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులకు దేశవ్యాప్తంగా అభినందనలు వచ్చాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు, ఇప్పుడు కనీసం ఊసెత్తడం మానేశారని దుయ్యబట్టారు. టెక్కలి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు.


వ్యవసాయ రంగంలో చేసిన అభివృద్ధిని తాము ప్రజలకు వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే అచ్చెన్నాయుడు రాగలరా అని సవాల్ విసిరారు.

నిబంధనలు బేఖాతర్..!

సోంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిబంధనలు పట్టించుకోకుండా బారువ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వ్యవహరించారు. ఇటీవల బారువ గ్రామంలో ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రహదారులు నిర్మించారు. వాస్తవానికి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు నిర్వహిస్తే పని ప్రదేశం, పని విలువ తెలియజేస్తూ నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడం కీలకం. కానీ బారువలో మాత్రం స్థానిక ఎమ్మెల్యే పేరును సైతం బోర్డుపై రాసి పచ్చప్రేమను చాటుకున్నారు.

నిబంధనలు ఇలా...

ఉపాధి నిధులతో జరిగే పనుల్లో బోర్డు ఏర్పాటు చేస్తే మహాత్మాగాంధీ బొమ్మ, ఉపాధి హామీ పథకం సింబల్, పని ప్రదేశం, పని గుర్తింపు సంఖ్య, అంచనా విలువ, ప్రారంభ తేదీ మాత్రమే రాయాలని నిబంధనలు తెలుపుతున్నాయి. కానీ నిబంధనలకు తూట్లు పొడుస్తూ బారువ గ్రామంలో ఎమ్మెల్యే పేరు రాశారు. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు బోర్డులపై కనీసం ప్రధానమంత్రుల పేర్లు కూడా రాయకపోవడం విశేషం. కానీ బారువలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. దీనిపై స్థానిక అధికారులు చెప్పినా నాయకులు వినిపించుకోలేదని తెలుస్తోంది.



బారువ గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్డు

రిమ్స్‌లో బీఎస్సీ పారామెడికల్ కోర్సులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా బీఎస్సీ పారా మెడికల్ కోర్సులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు డిప్లొమా, పారామెడికల్ కోర్సులు మాత్రమే అందుబాటులో ఉండగా తాజాగా డిగ్రీ స్థాయిలో ఐదు విభాగాల కోర్సులు మంజూరయ్యాయి. 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రిమ్స్ వైద్య కళాశాలను మంజూరు చేయగా తర్వాత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. ఫలితంగా వైద్య కళాశాలకు అనుబంధంగా ఉండాల్సిన నర్సింగ్, పారా మెడికల్ కోర్సులు మంజూరు అవ్వలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో బాధ్యతలు స్వీకరించాకే పారామెడికల్ కోర్సులు, నర్సింగ్ కోర్సులు మంజూరయ్యాయి. ఈ క్రమంలోనే డిగ్రీ స్థాయిలో పారామెడికల్ కోర్సులు మంజూరవుతాయన్న సమయంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పెండింగ్‌లో ఉండిపోయాయి. తాజాగా ఐదు కోర్సులతో 50 సీట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఎనస్తీషియా అండ్ ఓటీ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసన్ టెక్నీషియన్, ఇమేజింగ్ టెక్నిక్స్, ఆప్తాలమిక్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నాలజీ వంటి కోర్సులు ఉన్నాయి. ప్రతిభ ఆధారంగా మార్చి నెలాఖరులోగా సీట్లను భర్తీ చేస్తారు.

తల్లి మందలించిందని..

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- ఉరివేసుకుని బలవన్మరణం
- కాశీబుగ్గ శివాజీనగర్‌కాలనీలో విషాదం



బుడుమూరు యశ్వంత్‌రాజు(ఫైల్)

కాశీబుగ్గ : 'పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్నాయి.. కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్ద చదవకుండా తిరుగుతున్నావు.. ఇలాగైతే ఎలా?' అంటూ తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం గ్రామం శివాజీనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడుమూరు దుర్గారావు దంపతులకు పిల్లలు లేకపోవడంతో యశ్వంత్‌రాజు(16)ను చిన్నతనంలోనే దత్తత తీసుకున్నారు. యశ్వంత్‌రాజు కాశీబుగ్గలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్నాడు. మూడు రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. పరీక్షలు దగ్గర పడుతున్నా చదవడం లేదంటూ తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన యశ్వంత్‌రాజు ఇంటికి సమీపంలో ఉన్న జగనన్నకాలనీకి వెళ్లి నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ చేతిలో చాకు ఉండటం, మరో చేతిలో ఉరివేసుకున్న గుడ్డముక్క ఉండటంతో మధ్యలో బతకాలని ప్రయత్నం చేసినా బయటపడలేక చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం



లారీ ఢీకొనడంతో బోల్తాపడిన ట్రాక్టర్



వెంకినాయుడి మృతదేహం



చికిత్స పొందుతున్న రమణమ్మ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి–కరజాడ జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రూరల్ ఎస్‌ఐ రాము తెలిపిన వివరాల మేరకు.. ప్రతిరోజులాగే జాతీయ రహదారి రోడ్డు పనుల క్లీనింగ్ నిమిత్తం నర్సాపురం అగ్రహారం గ్రామానికి చెందిన 12 మంది వెళ్లారు. వీరంతా స్థానికంగా ఉన్నటువంటి కాంట్రాక్టర్ వద్ద వీరంతా కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం మడపాం టోల్‌గేటు వద్ద భోజనాలు చేసి, తిరిగి పనిలోకి ట్రాక్టర్ మీదుగా జాతీయ రహదారి పనులు చేస్తున్న బైరి ఫ్లై ఓవర్ వద్దకు వెళ్లిపోయారు. అనంతరం అక్కడ ట్రాక్టర్ దిగుతుండగా నరసన్నపేట నుంచి విశాఖపట్నం మీదుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిన్నింటి వెంకినాయుడు(38) అక్కడికక్కడే మృతి చెందాడు. లింగాల రమణమ్మ అనే మహిళ తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రాణాలతో కొట్టిమిట్టాడుతోంది. ప్రస్తుతం ఈమె పరిస్థితి కుడా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. అత్యవసర చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



గాయపడిన జయలక్ష్మిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణంలోని సంతోషిమాత గుడి సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బూరగాం గ్రామానికి చెందిన భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బూరగాం గ్రామానికి చెందిన రవీంద్రరెడ్డి తన భార్య జయలక్ష్మి, తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై టెక్కలి వచ్చారు. అనంతరం ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ద్విచక్ర వాహనం హ్యాండిల్‌కి తగలడంతో అదుపుతప్పి బోల్తాపడ్డారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న భార్యాభర్తలకు గాయాలు కాగా, బాలుడికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. గాయపడినవారిని స్థానికులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

8 కేజీల గంజాయి స్వాధీనం

- 11 మంది యువకులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్, పక్కనే ఎస్‌ఐ రాములు

టెక్కలి రూరల్: మండలంలోని బొరిగిపేట గ్రామ సమీప తోటల్లో గంజాయి అక్రమంగా రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్, ఎస్‌ఐ రాములు తన సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా సుమారు 8 కిలోల గంజాయితో 11 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో టెక్కలి పెద్ద శివాలయం వీధికి చెందిన జి.దేవేంద్రనాథ్, ఒడిశాకు చెందిన కె.బిజయ్, టెక్కలి ఎన్టీఆర్ కాలనీకి చెందిన డి.మోహన్, బి.మధు, సంతబొమ్మాళి మండలం కాశీపురం గ్రామానికి చెందిన ఆర్.తరుణ్ కుమార్, టెక్కలి అంబేడ్కర్ వీధికి చెందిన ఎస్.వంశీ, కోదండరామ వీధికి చెందిన బి.సాయితేజ, కోటబొమ్మాళి మండలానికి చెందిన వై.దీవన్ కుమార్, టెక్కలి అయ్యప్పనగర్‌కు చెందిన సీహెచ్ చందు, పాత టెక్కలికి చెందిన జి.అన్వేష్, టెక్కలి మండలం జెండాపేటకు చెందిన జి.సాయివెంకట నాగ వరప్రసాద్ రెడ్డి ఉన్నారు.

ఆదాయం కోసం ఆశపడి

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవేంద్రనాథ్ అనే వ్యక్తి టెక్కలిలో చెప్పులు దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే దుకాణం వలన వచ్చే ఆదాయం సరిపోక ఒడిశా రాష్ట్రం రాయగడలో ఉన్న బిజయ్‌తో పరిచయం పెంచుకున్నాడు. అతని వద్ద నుంచి కొంత మొత్తంలో గంజాయి కొనుగోలు చేసి, వాటిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముకొని లాభాలు పొందేవాడు. మిగిలిన 9 మంది యువకులు దేవేంద్రనాథ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి తాగేవారు. అయితే దేవేంద్రనాథ్ సదరు యువకులతో మాట్లాడి ఒడిశాలో ఉన్న వ్యక్తిని పరిచయం చేస్తానని, అతని వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి తనకు ఇస్తే మంచి లాభాలు ఇస్తానని చెప్పడంతో వారు కూడా అంగీకరించారు. దీనిలో భాగంగానే ఒడిశా వెళ్లి ట్రైన్‌లో గంజాయిని టెక్కలి తీసుకొచ్చి, వారు తాగేందుకు కొంతమొత్తం ఉంచుకుని మిగిలినది దేవేంద్రనాథ్‌కు అమ్మేవారు. అలా కొన్ని రోజులు జరిగిన తర్వాత యువకులను సైతం గంజాయి తీసుకొచ్చి అమ్ముకోవాలని సూచించాడు. అయితే పోలీసుల చెకింగ్‌లు ఎక్కువగా ఉన్నాయని అనడంతో దేవేంద్రనాథ్ ఒడిశాలో ఉన్న బిజయ్‌కి ఫోన్‌చేసి 8 కేజీల గంజాయి తీసుకురావాలని చెప్పాడు. దీంతో ఆ వ్యక్తి ట్రైన్‌లో తీసుకొచ్చి పెద్దసాన సమీపంలో ట్రైన్‌దిగి వారికి ఫోన్ చేశాడు. మిగిలిన వారు 4 ద్విచక్ర వాహనాలపై వెళ్లి పెద్దసాన రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వ్యక్తిని ఎక్కించుకుని బొరిగిపేట సమీప తోటల్లోకి వెళ్లారు. అక్కడ గంజాయిని వారు వాటాలు వేసుకుని తిరిగి టెక్కలి వస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు ప్యాకెట్లలో 8.140 కేజీల గంజాయితో పాటు నాలుగు ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టెక్కలి సీఐ విజయ్ కుమార్ తెలిపారు.


రణస్థలం రహదారిపై వెళ్తున్న భారీ వాహనం



ముందుకు వెళ్లే దారేదీ?

విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న భారీ వాహనం కారణంగా శనివారం రణస్థలం వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విశాఖపట్నం వింగ్స్ సప్లయ్ అండ్ సర్వీస్ కంపెనీ తయారు చేసిన ఈ భారీ రియాక్టర్ చాలా నెమ్మదిగా ట్రాలర్ వాహనంపై తరలిస్తున్నారు. ఈ క్రమంలో వెనుక వచ్చే వాహనాలు ఓవర్ టేక్ చేసేందుకు ముప్పుతిప్పలు పడ్డాయి. రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పలేదు.

-రణస్థలం



భారీ వాహనం వెనుక బారులుతీరిన ఇతర వాహనాలు